ప్రజాశక్తి
ఆదివారం 17 నవంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

గిరిజన పాఠశాలలకు నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు నిధులు విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు, జిల్లా అధ్యక్షులు తోట రమేష్, ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు ఒక ప్రకటనలో కోరారు. మిగిలిన అన్ని యాజమాన్య పాఠశాలలకు స్కూల్ గ్రాంట్స్ ఇస్తున్నట్లు గానే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకూ విడుదల చేయాలన్నారు. దీని కోసం జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ,ఎస్ఎస్ఎ అధికారులు ప్రతిపాదనలు పంపించాలని కోరారు.

మున్సిపల్ టీచర్లకు పిఎఫ్ సౌకర్యంపై హర్షం

మున్సిపల్ టీచర్లు, ఉద్యోగులకు పిఎఫ్ ఖాతాలు తెరవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయమని వారు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కల ఇప్పటికి నెరవేరడం యుటిఎఫ్ పోరాటాల ఫలితమేనని చెప్పారు.

అభివాదం చేస్తున్న సిపిఎం నాయకులు

ఉత్సాహంగా సిపిఎం మహాసభ

- భారీ ప్రదర్శనతో ఎరుపెక్కిన రహదారి
- ప్రత్యేక ఆకర్షణగా రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు
- ఉత్తేజపర్చిన నాయకుల ప్రసంగం
- సీతారాం ఏచూరి నగర్ వేదికగా ప్రతినిధుల సభ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / టౌన్

సిపిఎం 10వ జిల్లా మహాసభ అత్యంత ఉత్సాహ పూరితంగా ప్రారంభమైంది. ఓ వైపు డప్పుల దరువులు... మరోవైపు చిన్నారుల కోలాటం, మార్క్సిస్ట్ పార్టీ సభ్యుల ఐక్యతా రాగం, 'పోరాటాలు వర్ధిల్లాలి' అంటూ కార్మిక, కర్షకుల నోట మిన్నంటిన నినాదాలతో ప్రదర్శన ముందుకు సాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన జనం పార్టీ జెండాలు చేబూని విప్లవ స్ఫూర్తితో ముందుకు కదిలారు. వందలాది మంది రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పదో జిల్లా మహాసభ సందర్భంగా పది మంది మహిళలు ఎర్రచీరలు ధరించి, ఎర్రజెండాలతో సమరోత్సాహంతో ప్రదర్శన అగ్రభాగాన నిలిచారు. ప్రదర్శనకు ముందు ఇక్కడికి పార్టీ నాయకులు, సభ్యులు, అభిమానులు, సానుభూతిపరులు వివిధ ప్రాంతాల నుంచి చీమల దండుగా కదలివచ్చారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలతో రహదారి ఎర్రబారింది.

సిపిఎం విజయనగరం జిల్లా మహాసభ నగరంలో శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నగరంలోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి వద్దగల గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ప్రదర్శన కన్యకాపరమేశ్వరి టెంపుల్, గంటస్తంభం, మూడు లాంతర్ల మీదుగా ముందుకు సాగింది. ప్రదర్శనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అగ్రభాగాన నిలుస్తూ ముందుకు నడిపారు. ప్రదర్శన అనంతరం కోట ఎదురుగా ఉన్న బొంకుల దిబ్బ వద్ద తమ్మినేని సూర్యనారాయణ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. సభలో నాయకుల ప్రసంగాలు పార్టీ కేడర్‌ను, సభకు హాజరైన జనాన్ని ఉత్తేజ పర్చాయి. పేదలు, అభివృద్ధికి అత్యంత దూరంగా ఉన్న దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన సామాజిక తరగతులకు చేస్తున్న అన్యాయం, కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ సంపద, వనరులను దోచిపెడు తున్న తీరును ఎండగట్టారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యారావు మాట్లాడుతూ గడిచిన పదేళ్ల కాలంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువత తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2,36,000 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీచేసేందుకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. సభాధ్యక్షులు, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ మహాసభల్లో గడిచిన మూడుళ్లలో పార్టీ శక్తి మేర ప్రజా పోరాటాలు నిర్వహించిందన్నారు. వీటిని సమీక్షించుకుని, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సభలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టివి.రమణ, వి.లక్ష్మి మాట్లాడారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

మినీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చాలి

కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యాన అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మాట్లాడారు. 42 రోజుల సమ్మె ఒప్పందాన్ని అమలు చేయాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు, ప్రమోషన్లు, వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించి జిల్లా జాయింట్ కలెక్టర్ శోభికకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాను ఉద్దేశిస్తూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల వై.మన్మధరావు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గంటా జ్యోతి, సరళ కుమారి మాట్లాడుతూ 42 రోజుల రాష్ట్రవ్యాప్త సమ్మె ముగిసి నేటికి 8నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం రాసి ఇచ్చిన ఒప్పందం మేరకు ఏ ఒక్క డిమాండ్‌ను నెరవేర్చలేదని విమర్శించారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలుకు, రాష్ట్ర అప్పుల కారణంగా చూపడం మానుకోవాలన్నారు. 300 కుటుంబాలకు మినీ సెంటర్ ఉండాల్సి ఉండగా 1500 కుటుంబాల్లో మినీ సెంటర్లను నిర్వహిస్తూ మినీ వర్కర్లను బానిసలుకంటే దారుణంగా పని చేయిస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సైతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 42 రోజుల సమ్మె ఒప్పందం అమలు చేయాలని, ఎన్ని మినీ సెంటర్లో ఉన్నాయో సర్వే కూడా జరిగిందని, మినీ వర్కర్లు వేసవి సెలవులు గ్రేడ్-2 సూపర్వైజర్ పోస్టు అవకాశం, ఇతర సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో దశలవారీ పోరాటాలకు అంగన్వాడీలు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర, గౌరమ్మ, హిమాప్రభ, అమరవేణి, అలివేలు, మేనక, సత్యవతి, సావిత్రి, నరసమ్మ, భారతి, మినీ అంగనవాడి వర్కర్లు పాల్గొన్నారు.

జిఎస్‌డబ్ల్యుఎస్ నోడల్ అధికారిగా రాంగోపాల్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారిగా సెట్విజ్ సిఇఒ బి రామ్ గోపాల్‌ను నియమించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న డ్వామా పీడీ నుంచి అదనపు బాధ్యతలు స్వీకరించాల్సిందిగా కలెక్టర్ ఉత్తర్వుల్లో ఆదేశాలు జారీ చేశారు.

పిజిఆర్ఎస్ నోడల్ అధికారుల నియామకం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఆడిట్ టీమ్ లను నియమించినట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు పీజీఆర్ఎస్ నోడల్ అధికారిగా ఉంటారని, వారికి సహాయకారిగా కార్యాలయ సిబ్బందిని నియమించడం జరిగిందని ఆయన చెప్పారు పిజిఆర్ఎస్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ ఆదేశాలు నిర్దిష్టంగా పాటించాలని, ఆడిట్ సక్రమంగా జరగాలని ఆయన స్పష్టం చేశారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

మండలంలో గోశాల ఏర్పాటు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని వెంకటరాయుడుపేట గ్రామాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శనివారం ఉదయం సందర్శించారు. జట్టు స్వచ్ఛంద సంస్థ వెంకటరాయుడుపేటలో గల గోశాల (ఎనిమల్ హాస్టల్) ఏర్పాటు చేసి, తద్వారా గ్రామాన్ని మోడల్ గ్రామంగా చేసేందుకు నిర్ణయించింది. ఈ మేరకు గ్రామంలో పరిస్థితులు, తదితర అంశాలను సంబంధిత ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. గ్రామ పంచాయతీలో గల పశు సంపదను ఉపయోగించుకొని పాలు, పాల ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి పెద్ద ఎత్తున మార్కెటింగ్ చేసేందుకు యోచిస్తున్నారు. జిల్లాలో వివిధ మండలాల్లో పెద్ద ఎత్తున డెయిరీ స్థాయిలో నిర్వహణకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని పశుసంవర్ధక శాఖ అధికారులకు ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వెంకటరాయుడుపేటలో ఏర్పాటు చేయనున్న గోశాలకు ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. జిల్లాలో ఈ ప్రాజెక్టు గొప్ప నాంది కాగలదని అన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగంగా వెంకటరాయుడుపేటలో ఆహ్లాదకర వాతావరణం నెలకొనాలని కోరారు. పాడి పశు సంపదను అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. నీటిని పొదుపుగా వాడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్రా సలహాదారు సి.శ్రీనివాసన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావు, పశు వైద్యాధికారి జయ కిరణ్, జట్టు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పెదబొండపల్లిలో ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని పెద్ద బొండపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దబొండపల్లి రైతు సేవా కేంద్రంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించామని చెప్పారు. జిల్లాలో 183 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఒక్కొక్క కేంద్రానికి ముగ్గురు చొప్పున నియమించిన తాత్కాలిక సిబ్బందికి కంప్యూటరీకరణ, ట్రాక్ పిట్లు, మిల్లులకు తరలింపు, తేమ శాతం తెలుసుకోవడంపై అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చామని చెప్పారు. బ్యాంక్ గ్యారంటీల విషయమై జిల్లాలో అందరు మిల్లర్లకు ఇప్పటి వరకు అదేశాలు జారీ చేశామని చెప్పారు. అందరు మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ ఇచ్చుటకు సిద్ధం చేసుకుంటున్నారని, కనీస మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు వారికి నచ్చిన మిల్లులకు ధాన్యం తరలించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. తొందరపడి దళారులను ఆశ్రయించొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఏమైనా ఫిర్యాదులుంటే జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలోను, జిల్లా సివిల్ సప్లయస్ మేనేజర్ కార్యాలయంలోను కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఉత్తరాంధ్రలో బాగా వెనుకబడ్డ నియోజకవర్గమైన పార్వతీపురాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. శనివారం శాసనసభ సమావేశాల్లో పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ పార్వతీపురం అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. ప్రధానమైన మూడు సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన ఆవశ్యకతను ఎమ్మెల్యే ప్రస్తావించారు. విశాఖ నుంచి రాయపూర్ వెళ్లే మార్గంలో హెవీ వెహికల్స్ వందలాదిగా తిరుగుతున్నాయని, పట్టణ మధ్యలో నుంచి ఈ వాహనాలు వెళ్లడం వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రస్తావించారు. ప్రమాద నివారణకు బైపాస్ రోడ్ అవసరం ఉందన్నారు. అలాగే జంఝావతి ప్రాజెక్టు నాలుగు దశాబ్దాలకు పైగా పెండింగ్లో ఉందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తికి చర్యలు తీసుకుంటే వేలాది ఎకరాలు సస్యశ్యామలవుతాయని అన్నారు. అలాగే తోటపల్లి ప్రాజెక్టు విస్తరణ తదితర అంశాలను ఎమ్మెల్యే ప్రస్తావించారు.

ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ ఆర్‌డి రవీంద్ర

ఎఐఐబి ప్రాజెక్టు ద్వారా సంపూర్ణంగా తాగునీరు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

2025 నాటికి పట్టణ ప్రజలకు ఎఐఐబి ప్రాజెక్టు ద్వారా సంపూర్ణ తాగునీటి సరఫరా లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రీజనల్ డైరెక్టర్ వి.రవీంద్ర అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఆయన ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటరీ, రెవిన్యూ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రా జిల్లాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలో గల నివాస గృహాలు వాణిజ్య సముదాయాలు ఖాళీ స్థలాల పన్నులు శతశాతం వసూళ్లు చేయాలని, నిర్వాసిత కాలనీయులైన నవిరి, గిజబ కాలనీలో ఉన్న ఇళ్లకు పన్నులు వేసి వసూలు చేయాలని రెవెన్యూ విభాగ అధికారులకు సూచించినట్లు తెలిపారు. ప్రతిరోజు పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేసేందుకు ప్రజారోగ్య విభాగం అధికారులకు సూచించారు. రీసర్వేను వేగవంతం చేయాలని, టౌన్ ప్లానింగ్ అనుమతుల్లేకుండా అనధికార నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా రూ.కోటీ 14 లక్షలతో ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు, మేనేజర్ లక్ష్మి, రెవెన్యూ అధికారి రూబేను దిబ్బ, ఎఇ సన్యాసిరావు, ప్రజారోగ్య అధికారి కె. ఫకీర్ రాజు, ఆర్ఐ జి.వినయ్‌కుమార్, బి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ మహాసభ సందర్భంగా జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

సిపిఎం పట్టణ కార్యదర్శిగా వెంకటరమణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ సిపిఎం కార్యదర్శిగా గొర్లి వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో పట్టణ సిపిఎం మూడో మహాసభ పట్టణ కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి, పాకల సన్యాసిరావుల అధ్యక్షతన జిల్లా కార్యదర్శి రెడ్డివేణు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర, యమ్మల మన్మధరావు పర్యవేక్షణలో జరిగింది. తొలుత సిపిఎం జెండాను సీనియర్ నాయకులు బి.సూరిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలో తాగునీరు సమస్య పరిష్కారానికి, పారిశుధ్య నిర్వహణ మెరుగుకు, స్మశాన వాటికల సమస్యలపైనా, టిట్కో ఇళ్ల సమస్యలపైనా, అమ్మఒడి, చేయూత, రోడ్లు, కాలువలు, పైపులైన్లు వంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలంటూ ఏకగ్రీవంగా పట్టణ కమిటీ ఆమోదించి తీర్మానించింది. అనంతరం కార్యదర్శిగా వెంకటరమణ, సభ్యులు రెడ్డి శ్రీను, పాకల సన్యాసిరావు, సంచాన ఉమామహేశ్వరరావు, పడాల రాజశేఖర్, బొత్స లక్ష్మి, మంత్రపూడి వెంకటరమణ, కె.భగత్, గౌరవ సభ్యులుగా బంకురు సూరిబాబు ఎన్నికయ్యారు.

ప్లాస్టిక్ నిషేధంపై ఉక్కుపాదం

పాలకొండ : ప్లాస్టిక్ విక్రయాలపై నగర పంచాయతీ కమిషనర్ శనివారం ఉక్కుపాదం మోపారు. ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేయాలన్న దృష్టితో కూరగాయల మార్కెట్, కిరాణా మార్కెట్‌లను విస్తత తనిఖీలు చేపట్టారు.0 షాపులపై అపరాధ రుసుం విధించారు. ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధి మాటున కాంట్రాక్టుల కక్కుర్తి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఏ మాటల వెనుక ఎవరి ప్రయోజనం దాగిఉందో తెలుసుకున్నంత వరకు ప్రజలు మోసపోతూనే ఉంటారట. ఈ విషయాన్ని లెనిన్ మహాశయుడు ఓ సందర్భంలో ఉద్బోధిస్తాడు. ఈ సూక్తిని జిల్లా వాసులు కొన్ని సందర్భాల్లోనైనా ఇప్పుడిప్పుడే అన్వయించుకుంటున్నారు. దీంతో పరిపాలనలో అధికార, ప్రతిపక్ష పార్టీల వైఖరి, ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరు అవగతం చేసుకుంటున్నామని చాలా మంది చెప్పుకుంటున్నారు. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్తు సమావేశంలో వెండార్లుగా సర్పంచులకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ వైసిపి.., వైసిపి ప్రవేశపెట్టిన విధానాలే తాము కూడా అమలు చేస్తున్నామంటూ టిడిపి తరపున స్థానిక మంత్రులు వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అసలు ఏమిటీ వెండార్?, ఇరు పార్టీల్లోనూ దీనికోసం ఎందుకంత ఆత్రం? అని ఎవరికి వారు ప్రశ్నించుకుంటే పాలక, ప్రతిపక్షాలు ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో, రూ.197 కోట్ల కోసం ఎంత పరితపిస్తున్నారో ఇట్టే అర్థం బోధపడుతుంది. జాతీయ ఉపాధి హామీ చట్టంలో భాగంగా కూలీలకు వేతనం రూపంలో చెల్లించే మొత్తంపై 60శాతం సొమ్ము మెటీరియల్ కాంపోనెంట్ పనులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది. గతంలో ఇలా వచ్చిన మొత్తాన్ని వెండార్ (మెటీరియల్ సప్లై చేసే వక్తులు) ద్వారా ఖర్చుచేసేవారు. మరో మాటలో చెప్పాలంటే వెండార్ ఖాతాలోనే డబ్బులు జమ అయ్యేవి. అలాగని సర్పంచ్ వెండార్‌గా ఉండాలన్నా మిగిలిన వారి మాదిరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందే. ఇదీ గత ప్రభుత్వం మధ్యాంతరంగా తీసుకొచ్చిన వెండార్ విధానం. ఇక ఆ నిధులు వినియోగానికి కూడా ప్రాధాన్య, ప్రాధాన్యేతర అనే పద్ధతిలో ఖర్చుచేశారు. ప్రాధాన్యత పనుల్లో అప్పటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గ్రామ సచివాలయాలు, ఆర్‌బికెలు, బల్క్‌మిల్క్, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు ఉండేవి. కాలువలు, రోడ్లు తదితర పనులు ప్రాధాన్యేతరలో పెట్టారు. దీంతో, కాస్త ఆర్థికంగా అవకాశం ఉన్న సర్పంచులు మాత్రమే తమ కుటుంబ సభ్యులు, అనుయాయులను వెండార్లుగా పెట్టి పనులు చేపట్టేవారు. ఏటా డిసెంబర్ నుంచి మార్చి నెలాఖరు వరకు మాత్రమే ప్రాధాన్యేతర పనులకు అవకాశం కల్పించడంతో ఆర్థికంగా అవకాశం లేనివారు ఆ పనుల జోలికి వెళ్లేందుకు సాహసించలేని పరిస్థితి ఉండేది. దీంతో అప్పట్లో పేరుకు సర్పంచులైనా అన్నీ వెండార్ అనే కాంట్రాక్టర్ లాంటి వారి ద్వారానే పనులు జరిగిపోతుండేవి. వీరి ఖాతాల్లో మాత్రమే బిల్లులు జమయ్యేవి. ఈ రకంగా పార్టీలో కాస్త రాజకీయంగా, ఆర్థికంగా పలుకుబడి ఉన్నవారికే లబ్ధి చేకూరింది. దీంతో, అప్పట్లోనే చాలా మంది గ్రామ సర్పంచులు డమ్మీలుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెండర్లు, సర్పంచులు ఒకే పార్టీ నాయకులు కావడంతో సమస్య రాలేదు. ఇందులో రూ.లక్షలు ఖర్చు చేసినా బిల్లులు కాక ఆర్థికంగా కూరుకుపోయినవారు ఎంతోమంది ఉన్నప్పటికీ అది వేరే సంగతి. ఐదు నెలల క్రితం టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీన్ రివర్స్ అయింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 90 శాతం సర్పంచులు వైసిపికి చెందినవారే ఉన్నారు. కానీ, వెండార్ పద్ధతి ఉండడంతో ఆ స్థానంలో రాజకీయ సిఫార్సులతో టిడిపి, జనసేన నాయకులు చొరబడ్డారు. ఎమ్మెల్యేల సిఫార్సులతో పాత వెండార్లను వెనక్కి నెట్టి, కొత్త వెండార్లుగా అవతారమెత్తారు. దీంతో, సర్పంచులతో పనులు చేయించాలని, ఉపాధి పనుల్లో వారిని పక్కన పెట్టడం పంచాయతీ అధికారాన్ని హరించడమేనని ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ సహా పలువురు జెడ్‌పిటిసి సభ్యులు గొంతెత్తారు. తామేమీ విధానం మార్చలేదని, గతంలో వైసిపి తీసుకొచ్చిన వెండార్ వ్యవస్థ ప్రకారమే మెటీరియల్ కాంపొనెంట్ పనులు చేపడుతున్నామని ఉమ్మడి జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తేల్చేశారు. దీన్నిబట్టి ఇరు పార్టీలకు చెందిన వారూ గ్రామాల అభివృద్ధి కన్నా వెండార్ పాత్రలో కాంట్రాక్టులు పొందేందుకే తహతహలాడుతున్నారని అర్థమౌతోంది.

సాయికి నివాళ్లు అర్పిస్తున్న విద్యార్థులు, యువకులు

అవయవదాతకు అఖండ నీరాజనం

సాయి చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజావక్తి - మక్కువ

అవయవదాతకు విద్యార్థులు మక్కువలో భారీ ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టి అఖండ నీరాజనం పలికారు. అనుమానాస్పద స్థితిలో బ్రెయిన్ డెడ్‌గా మృతి చెంది, మరో నలుగురికి అవయవ దానం చేసిన లంకెన సాయికుమార్ చిత్రపటానికి శనివారం విద్యార్థులు పాలాభిషేకం చేశారు. వివిధ పాఠశాల చెందిన విద్యార్థులతో స్థానిక వైసిపి, టిడిపి నాయకులు ఎం.రంగు నాయుడు, ఎం.ప్రసాదరావునాయుడు మక్కువ వీధుల్లో ర్యాలీగా వెళ్లి స్థానిక పోలీస్ స్టేషన్ సమీపాన కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం కొద్దిసేపు సాయి మృతికి సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం ప్రసాదరావు నాయుడు మాట్లాడుతూ మక్కువలో అందరితో సరదాగా మెలుగుతూ మంచి వ్యక్తిగా పేరు పొందిన సాయి మృతి అందర్నీ దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. అయితే అవయవ దానం చేస్తూ అతని తల్లిదండ్రులు చూపిన చొరవ నలుగురు ప్రాణాలను కాపాడమే కాకుండా ఎంతో మందికి ప్రేరణగా మారిందన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఎల్‌టిఆర్ కేసులపై విచారణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎల్ టి ఆర్ కేసులపై పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ విచారణ చేశారు. ఎల్విన్ పేట గిరిజన సంక్షేమ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో గుమ్మలక్ష్మి పురం మండలం దిగువ మండ, కురుపాం మండలం నీలకంఠపురం గ్రామాలకు చెందిన కేసులను శనివారం విచారణ చేశారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత లోపాలు లేకుండా చూస్తాం: ఎఇ

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి వనం గుడి వద్ద జరుగుతున్న లీన్ కాంక్రీట్ పనుల్లో నాణ్యతా లోపం లేకుండా చర్యలు చేపడతామని పంచాయితీరాజ్ ఎఇ రజిత్‌కుమార్ తెలిపారు. శనివారం 'వనం గుడి రహదారి పనుల్లో నాణ్యతా లోపం' అన్న 'ప్రజాశక్తి' వార్తకు ఆయన స్పందించారు. ఐదు అంగుళాల సిసి రోడ్డు నిర్మాణానికి ముందు 40 ఎంఎం మెటల్‌తో లీన్ కాంక్రీట్ పనులు చేపడుతున్నామన్నారు. పూర్తిస్థాయిలో యంత్రాలతో కాంక్రీట్ వేస్తున్నామన్నారు. కొన్నిచోట్ల యంత్రం నడిచేటప్పుడు కూరుకుపోయి బురద ప్రాంతం ఉండడం వల్ల కొంత ఇసుక బయటకు వచ్చిందన్నారు. సిబ్బంది పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని ఆయన వెల్లడించారు

'స్వచ్ఛ సుందరం'పై అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రామాలను స్వచ్ఛ సుందరంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులపై ఉందని ఎంపిడిఒ సాల్మన్‌రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛ సుందర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాల ద్వారా ఆహ్లాదకరంగా ఉంచాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరారు. ప్రజలు అంటు రోగాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు గ్రామాల్లో క్లోరినేషన్ చేపట్టాలని, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

19 నుంచి ఆధార్ నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో ఈనెల 19 నుంచి 28 వరకు ఆధార్‌లో విద్యార్థులకు మార్పులు, చేర్పుల కోసం ప్రత్యేక కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు తెలిపారు. మండలంలోని జోగింపేట, బూర్జ, అంటిపేట గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటికి మండలస్థ ఆయా గ్రామకార్యదర్శులు, మహిళా పోలీసులు సమాచారం అందించాలన్నారు.

ఈతమానుగూడ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ఈతమానుగూడ జిపిఎస్ పాఠశాలను ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు శనివారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యం పరిశీలించారు. విద్యార్థులకు అకుపాఠాలలో బోధించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. హాజరును పరిశీలించారు. ఆయన వెంట పిఎంఆర్‌సి సిబ్బంది, జిసిటిఒ రాములమ్మ తదితరులు ఉన్నారు.

టిక్కిబాయి పాఠశాలలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బిర్సా ముండా జయంతి ఉత్సవ సందర్భంగా స్థానిక సహాయ గిరిజన సంక్షేమ అధికారి ఆధ్వర్యాన మండలంలోని టిక్కిబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎటిడబ్ల్యుఒ సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను సోమవారం ఐటిడిఎ స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్ఞానప్రకాష్, వార్డెన్ అప్పారావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో క్రీడా పాఠశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో క్రీడా పాఠశాలను ఏర్పాటు చేయాలని అరకు పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు ఆయన చెప్పారు. క్రీడా పాఠశాల ఏర్పాటు గురించి ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారని అన్నారు. ఇక్కడ క్రీడా పాఠశాల ఏర్పాటు చేస్తే ఎంతో మంది గిరిజన క్రీడాకారుల శిక్షణ ఎంతగానో ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.

ఆరోగ్య పరీక్షలు పరిశీలించిన డిహెచ్‌పిఒ

ప్రజాశక్తి - కొమరాడ

స్కూల్ హెల్త్ స్క్రీనింగ్‌లో భాగంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలను వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు పరిశీలించారు. ఈ మేరకు కోటిపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది హెల్త్ స్క్రీనింగ్ చేపట్టారు. ప్రతి విద్యార్థిని ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న తీరును ఆయన నిశితంగా పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి విద్యార్థుల అనారోగ్య సమస్యలు కారణంగా తరచూ స్కూల్‌కు రాలేకపోవడం ఎవరైనా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, పిహెచ్‌ఎన్ విజయ కుమారి, ఎఎన్‌ఎం ఇ. సత్తిబాబు, ప్రభు తదితరులు, ఆశా కార్యకర్త ఉన్నారు.

గిరిజన సొసైటీ ఎన్నికలకు 9 నామినేషన్లు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట గిరిజన సహకార సంస్థ బ్రాంచ్ పరిధిలో ఉన్న గిరిజన సొసైటీ ఎన్నికలకు శనివారం 9 నామినేషన్లు ఎన్నికల అధికారి జి.విజయకుమార్, డిఎల్‌ఓఎ వై.మోహనరావు స్వీకరించారు. ఈ బ్రాంచ్ పరిధిలో 649 మంది సభ్యులున్నారని తెలిపారు. ఈనెల 18న నామినేషన్ల పరిశీలన, 19న ఉపసంహరణ, 25న పోలింగ్ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిసిసి మేనేజర్ దాసరి కృష్ణ తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఒ చిన్నబాబు

ఎస్‌ఎల్‌ఆర్‌ఎం విధానాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఎస్‌ఎల్‌ఆర్‌ఎం ఘన, ద్రవ వ్యర్థాలు నుంచి సంపద సృష్టి విధానాలు గ్రామస్థాయిలో అమలు చేయాలని ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు అన్నారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో శనివారం సీతంపేట, భామిని, పాలకొండ, వీరఘట్టం మండలాల ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కార్యదర్శులతో స్వచ్ఛ సుందర పార్వతీపురం మన్యం ఎస్‌ఎల్‌ఆర్‌ఎంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ ఘన వ్యర్థాలు, ద్రవ వ్యర్థాలు ఎలా సేకరించాలో అవగాహన కల్పించారు. దీంతో పాటు ఎలా వేరు చేసి సమాజానికి హాని కలగకుండా సంపద సృష్టించవచ్చో తెలిపారు. స్వచ్ఛంద కార్పొరేషన్ అడ్వైజర్ ప్రతినిధులు పవర్ ప్రజెంటేషన్ ద్వారా వ్యర్థాలపైన సంపద సృష్టించడం వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, జెడ్‌పిటిసి లక్ష్మీ ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ మాస, ఇఒపిఆర్‌డి కె.సత్యం, పిహెచ్ గణేష్, కార్యదర్శులు రామకృష్ణ, వినోద్, శ్యామ్, కామేశ్వరరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంచగవ్యతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - పాచిపెంట

పంచగవ్యతో అన్ని రకాల పంటల నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. విశ్వనాధపురంలో రైతు కిర్ల నాగభూషణరావు ఒక ఎకరా మామిడితోట కోసం ప్రకృతి సేద్య ప్రతినిధి విజయ్ ఆధ్వర్యంలో పంచగవ్య తయారు చేయించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ పంచగవ్య పంట పూత, పిందె దశల్లో పిచికారీ చేసుకుంటే కనీసం 20 శాతం అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. 15 రోజుల వ్యవధిలో రెండోసారి కూడా పిచికారీ చేసుకున్నట్లయితే రంగు, రుచి నాణ్యతతో అధిక దిగుబడులు, పంటకు తెగుళ్లను తట్టుకునే శక్తి కలుగుతుందని అన్నారు. మార్కెట్లో దొరికే అన్ని రకాల గ్రోత్ ప్రమోటర్ల కంటే కూడా ఇది ఎంతో నాణ్యమైన, సహజ సిద్ధమైన గ్రోత్ ప్రమోటర్ ఎఒ తెలిపారు.

పాలకొండ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

కమిషనర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని సమస్యలను పరిష్కరించి సమగ్ర అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావుకు శనివారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పాలకొండ మండల కమిటీ కన్వీనర్ దావాల రమణారావు మాట్లాడుతూ నగర పంచాయతీలో డంపింగ్ యార్డ్ శాశ్వత పరిష్కారం చేపట్టాలని, పట్టణంలో వివిధ సెంటర్లో చెత్త డంపింగ్‌కు వీలుగా సుమారు 40 బిన్నులు ఏర్పాటు చేయాలని, సంపూర్ణ పారిశుధ్యం మెరుగుకు సిబ్బంది సంఖ్య పెంచాలని, జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని, కాలనీల్లో గృహనిర్మాణదారులకు హౌసింగ్ బకాయి బిల్లులు చెల్లించాలని, మిగిలిన వారందరికీ ఇళ్ల నిర్మాణాలకు అనుగుణంగా హౌసింగ్ అమలుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గారమ్మ కాలనీ, బుట్టిమఠం కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు చేపట్టాలని, పట్టణంలో అన్ని వార్డులకు కనీస అవసరమైన రక్షిత తాగునీరందించేందుకు వీలుగా ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసేందుకు వీలుగా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాలకొండ పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా లేనందున ఈ వ్యవస్థ కోసం ప్రణాళికలు సిద్ధం చేసి అవసరమైన చోట అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం కోసం తగు చర్యలు తీసుకోవాలని, పట్టణంలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని, వెంకట రాయుని కోనేరు వద్ద పార్కు ఏర్పాటు గతంలో ప్రతిపాదం చేసినప్పటికీ ఎప్పటికీ ఏర్పాటు కానందిన సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. నగర పంచాయతీ పరిధిలో ప్రధాన రోడ్ల వద్ద మార్కెట్ల వద్ద, ముఖ్యమైన ప్రాంతాల్లో సులభ కాంప్లెక్స్‌లకు ఏర్పాటు చేయాలని, క్రీడాకారులకు విద్యార్థి విద్యార్థులకు వీలుగా మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని, తదితర సమస్యలతో పాటు పాలకొండ నగర పంచాయతీ సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కాద రాము, దూసి దుర్గారావు, మాజీ వార్డు సభ్యులు ఎస్.నారాయణరావు, కె.శ్రీనివాసరావు, జి.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కురుపాం

పంచాయతీల అభివృద్ధికి ఇస్తున్న శిక్షణను సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో పంచాయతీల అభివృద్ధి, ప్రణాళికలపై ఇచ్చిన శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కీలకమని, పంచాయతీల్లో సమస్యలపై పూర్తిగా అవగాహన ఉంటుదని, పంచాయతీని ఎలా అభివృద్ధి చేయాలన్నది వారికి బాగా అవగాహన ఉంటుందని అన్నారు. అయినా అధికారులు అభివృద్ధి ప్రణాళికలపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుంటే ఈ శిక్షణ ఇంకెంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జి.రమేష్‌బాబు, వైస్ ఎంపిపిలు అన్నాజీరావు, రంగారావు, మండలంలో గల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీతానగరం: గ్రామపంచాయతీల అభివద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిపి బి.రమణమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు, ఎంపిటిసిలకు గ్రామాల అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోఉండే సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించాలన్నారు. ఆర్థిక వనరులను సేకరించి గ్రామాల అభివద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, రిసోర్స్ పర్సన్లు శ్రీనివాసరావు, మనోహర్, శశి భూషణ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు

కురుపాం : శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిపి పద్మావతి

పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొమరాడ : ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి కేటాయిస్తున్న నిధులు ఖర్చుపై అవగాహన అవసరమని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీల ప్రణాళికల శిక్షణ తరగతులు నిర్వహించారు. జిపిడిపి శిక్షణ నిమిత్తం గ్రామపంచాయతీల్లో సర్పంచులకు, ఎంపిటిసిలు, లైన్ డిపార్ట్మెంట్ల సచివాలయ సిబ్బంది, వివిధ అధికారులతో వారి యాక్షన్ ప్లాన్ గురించి వివరించారు. అనంతరం జరిగే శిక్షణా తరగతులను అధికారులు, ప్రజా ప్రతినిధులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్తగా రామకృష్ణ

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయ కర్తగా గేదెల రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల నియామక ఉత్తర్వులు జారీచేశారు. సబ్ డివిజనల్ కోపరేటివ్ అధికారిగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన తర్వాత రామకృష్ణ రాజకీయాల్లో చేరారు. ఈయన నియామకానికి పార్టీ సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి పుండరీకాక్ష నాయుడు, పట్టణ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య కృషి చేశారు. శనివారం సీతారామ కళ్యాణమండపంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో రామకృష్ణను పరిచయం చేశారు. రానున్న ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా అధిష్ఠానం నియోజకవర్గ సమన్వయకర్తలను నియమించిందని పట్టణ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య చెప్పారు. సమన్వయకర్త రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి పుండరీకాక్ష నాయుడు, సిగడాపు బంగారయ్య సలహాలు సూచనల మేరకు నియోజకవర్గం లో పార్టీ అభివద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

రామకృష్ణను అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నలుగురికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి సచివాలయం సకాలంలో విధులకు హాజరు కాకపోవడంతో షోకజ్ నోటీసులు ఇచ్చినట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ శనివారం తెలిపారు. డిజిటల్ సహాయకులు, ఇంజనీరింగ్, వ్యవసాయ, పశు సహాయకులు సమయానికి విధులకు హాజరు కాకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి : సిఐ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

సమాజంలో యువత భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా మారిన మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని వీటిని ఎదుర్కోకపోతే రానున్న తరాల్లో యువత మరింత అథఃపాతాళానికి వెళ్లే అవకాశం ఉందని చినమేరంగి సిఐ తిరుతిరావు అన్నారు. మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సంకల్పం పేరిట శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గణపతి మహరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై అనీష్ , లెక్చరర్లు నగేష్ , గౌరీ శంకర్ , కల్పన , తేజ

గుమ్మలక్ష్మీపురం : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకుని మంచి భవిష్యత్తును నిర్దేశించుకోవాలని ఎల్విన్ పేట ఎస్ఐ బి.శివప్రసాద్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చెడు వ్యసనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేటితరం యువత, విద్యార్థులు సారాయి, గంజాయి వంటి చెడు వ్యసనాలకు అలవాటు పడి నిండు జీవితాలను పాడు చేసుకోవద్దని హితవు పలికారు.

సీతానగరం : మాదక ద్రవ్యాలు వాడకం వల్ల యువత అనేక రుగ్మతలు కొని తెచ్చుకుంటున్నారని ఎస్ ఐ ఎం రాజేష్ అన్నారు. మండలంలోని అప్పయ్యపేట, జోగింపేటలో మాదకద్రవ్య నిర్మూలన, ట్రాఫిక్ నియమాలపై గ్రామస్తులకు, యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమం పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

కురుపాం : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని స్థానిక ఎస్సై పి.నారాయణరావు అన్నారు. సంకల్పం కార్యక్రమంలో స్థానిక జ్యోతిబాపూలే

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐ తిరుపతిరావు

పాఠశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్, చెడు వ్యసనాలకు , మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఇప్పటి నుంచే విద్యార్థులు సక్రమంగా చదువుకుంటే ఉన్నత చదువులు చదివిన తర్వాత ఉద్యోగాలు సులభంగా పొందవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : మద్యం సేవించడం అనారోగ్యానికి గురి కావడమేనని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ అన్నారు. పట్టణంలోని 25వ వార్డు శివారులో పెదరెల్లి వీధిలో స్థానికులకు నాటు సారా, అక్రమ మద్యం వాడడం, కలిగివుండడం, రవాణా చేయడం వలన కలిగే నష్టాలను, అనారోగ్య సమస్యలను అనర్థాలు గురించి అవగాహన కల్పించారు. అనంతరం సంకల్పం ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేశారు. మహిళల భద్రత గురించి వివరించారు. ఆన్లైన్ మోసాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సూర్యకుమారి, ఉపాధ్యాయులు, పోలీసులు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యవంతమైన విద్యార్థులే విద్యలో రాణించగలరు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

గిరిజన విద్యార్థుల ఆరోగ్యం ఉపాధ్యాయులు, వసతి గృహాల నిర్వాహకుల చేతుల్లోనే ఉందని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. శనివారం ఆయన టికె జమ్ము గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన విద్యార్థులే విద్యలో రాణించగలరని, విద్యార్థి దశలోనే పిల్లలు మానసికంగా, శారీరక ధారుడ్యం బలపడి ఉండాలని అన్నారు. అప్పుడే వారు విద్యలో సంపూర్ణతను సాధించి తాము ఎంచుకున్న స్థితికి చేరగలరని అన్నారు. అందుకు కౌమార బాలికలకు ఐరన్ తక్కువైతే దాని ప్రభావం వారి జీవితమంతా ఉంటుందన్నారు. జిల్లా కన్సల్టెంట్ రామచంద్ర మాట్లాడుతూ మలేరియా పాజిటివ్ వచ్చిన పిల్లలకు ప్రత్యేక సిక్ రూమ్‌లో ఉంచడం ద్వారా మిగతా పిల్లలకు సోకకుండా జాగ్రత్తపడవచ్చని తెలిపారు. అనంతరం హాస్టల్‌లోని పాకశాలను పరిశీలించి శుభ్రత బాగుందన్నారు. అనంతరం దిగువ సిరిపిలో ఇటీవల వచ్చిన మలేరియా కేసులను పరామర్శించి ఫోకల్ స్ప్రేయింగ్ ద్వారా ప్రతి ఇంటినీ దోమల నుంచి కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు కృష్ణవేణి, వార్డెన్ లక్ష్మీ, సబ్ యూనిట్ అధికారి రాధాకృష్ణ, మలేరియా సూపర్ వైజర్ ఆదినారాయణ, ఎఎన్‌ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి సచివాలయాన్ని శనివారం స్థానిక ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది మూమెంట్ రికార్డు పరిశీలించగా, ఉద్యోగుల విధి విధానాలు అందులో పొందుపర్చక పోవడంతో సకాలంలో విధులకు హాజరు కావట్లేదని గుర్తించినట్లు ఆయన తెలిపారు.

నాటు సారా, అక్రమ మద్యం అమ్మితే చర్యలు

ప్రజాశక్తి - సీతానగరం

నాటు సారా, అక్రమ మద్యం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు ఉంటాయని ఎక్సైజ్అండ్ ప్రొహిషన్ సిఐ డి.పద్మావతి హెచ్చరించారు. ఈ మేరకు బలిజిపేట మండలం సుభద్రలో నాటు సారాయి, అక్రమ మద్యంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అక్రమ మద్యం, నాటుసారా విక్రయిస్తున్నా, ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విక్రయించినా 944090 2373 ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర వద్ద నాటు సారా రవాణా, అక్రమ మద్యం రవాణాను అరికట్టడానికి రూట్ వాచ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో గ్రామస్తులు, ఎక్సైజ్ అధికారులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యం పెంచేందుకే డిక్టేషన్ టెస్ట్

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యార్థుల సామర్థ్యం పెంచేందుకే స్థానిక కెజిబివి పాఠశాలలో డిక్టేషన్ టెస్టు నిర్వహించినట్లు ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు తెలిపారు. ఆరో తరగతి నుండి తొమ్మిదో తరగతులకు తెలుగు, ఇంగ్లీషు, గణితంలో గుణంకారం, బాగాహారం సామర్థ్యాలు పరిశీలించారు. పది నుంచి ఇంటర్ వరకు అన్ని సబ్జెక్టులకు డిక్టేషన్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

తాగునీటికి నోచని కుమ్మరిగుంట గిరిజనులు

ప్రజాశక్తి - పాచిపెంట

రెండు నెలలకు పైగా తాగునీటి సమస్య పరిష్కరించకపోవడంతో గెడ్డ, చలమల నుంచి కలుషిత నీరు తాగి రోగాల బారినపడుతున్నామని మండలంలోని కుమ్మరివలస గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కేసలి పంచాయితీ నిర్వాసిత గిరిజన గ్రామమైన కుమ్మరివలస గల రక్షిత మంచినీటి మోటారు మరమ్మతుకు గురై రెండునెలలు అయ్యిందని, దీనిపై ఎంపిడిఒకు, ఇతర అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని స్థానిక సిపిఎం నాయకులు దీసరి వసంతరావు, మహిళలు కోడికాల బీమాలు, నారాయణమ్మ, బుచ్చమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ కలుషిత నీరు తాగి గత నెల గ్రామ గిరిజనులంతా జ్వరాల బారిన పడ్డారన్నారు. పాచిపెంట పిహెచ్‌సి వైద్యాధికారులు రక్తపరీక్షలు నిర్వహించగా కలుషిత నీరే కారణమన్నారన్నారు.ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన ఆ గ్రామంలో బోరు బాగుచేయాలని కోరారు.

ఆ సమాచారానికి ప్రభుత్వానిదే బాధ్యత : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ఇంటింటి సర్వే పేరుతో ప్రజల నుంచి సేకరిస్తున్న సమాచారానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర చెప్పారు. శనివారం తన నివాసంలో ఇంటింటి సర్వే పేరుతో సమాచార సేకరణకు సచివాలయం సిబ్బందికి ఆయన సహకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కుటుంబంలో ఉన్న సభ్యుల ఆధార్ కార్డులు, ఫోన్ నెంబర్లు, ఐరిస్, వేలిముద్రలను సర్వే సిబ్బంది తీసుకుంటున్నారని చెప్పారు. ఈ సమాచారంతో ప్రజల ఆస్తులు, బ్యాంక్ ఖాతాల్లో వున్న డబ్బులకు నష్టం వుండదని ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వగలదా అని ప్రశ్నించారు. ఒకవేళ ప్రజల సమాచారాన్ని చోరీ చేసి సైబర్ నేరాల కు పాల్పడితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గతంలో వైసిపి ప్రభుత్వం హయాంలో వాలంటీర్ల ద్వారా ఇలాంటి సమాచారం సేకరిస్తే టిడిపి,జనసేన నాయకులు గగ్గోలు పెట్టారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్నదేమిటని నిలదీశారు. విధానమండలిలో వైసిపి సభ్యులు ఈ విషయాన్ని ప్రస్తావించాలని రాజన్నదొర కోరారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికై ఈనెల 18న కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి హాజరుకానున్నట్టు రెండు పిహెచ్‌సిల వైద్యాధికారులకు వినతిని అందజేశారు. అనంతరం సాంబమూర్తి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సుమారుగా 2,361 మంది వరకు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశ వర్కర్లుగా మార్పు చేయాలని కోరారు. ఆశా వర్కర్లతో సమానంగా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నేటి వరకు ఉన్న బకాయి వేతనాలు చెల్లించాలని, గర్భిణులను ఆసుపత్రులకు తీసుకెళ్లేటప్పుడు డిఎలు ఇవ్వాలని కోరారు. రూ.10లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఎఎన్‌ఎం శిక్షణ పొందిన గిరిజన ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఎఎన్‌ఎంగా నియమించాలని కోరారు. ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.23 వేలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచి పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

విద్యార్థి దశ నుంచి పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఎల్.రమేష్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి గ్రంథా లయాలు ఎంతో దోహద పడతాయని, పుస్తకం చదవడం ద్వారా సంపాదించిన జ్ఞానాన్ని ఎప్పటికీ మరువలేమన్నారు. పుస్తక పఠనంతో వ్యక్తిగత వికాసంతో పాటు విజ్ఞానం నైపుణ్యత పెంపొందించుకో వచ్చన్నారు. గ్రంథాలయాల్లో ఉన్న సాహిత్యం, మహనుభావుల జీవిత చరిత్రలు, ఇతర పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలన్నీ ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రతి విద్యార్థి తన భవిష్యత్తును

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డిపిఆర్‌ఒ రమేష్

తీర్చిదిద్దుకోవాలన్నారు. ఒక మంచి పుస్తకం ఒక మంచి స్నేహితుడు గా ఉపయోగపడు తుందని అన్నారు. గ్రంథాలయ సంఘం అధ్యక్షులు టి శివ కేశవరావు మాట్లాడుతూ నిత్య పఠనం విజ్ఞాన దాయకం అన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ మాట్లాడుతూ మంచి పుస్తకం మంచి స్నేహితునితో సమానం అన్నారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి, విజేతలకు జ్ఞాపికలు, పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతంపేట : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 3వ రోజు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులకు ఆచార్య ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్యకు డిప్యూటీ డిఇఒ నారాయుడు ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్ బాబు సహాయకుడు రామకష్ణ పాల్గొన్నారు.

తోటపల్లి పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ, వీరఘట్టం, బూర్జ మండలాలకు సాగు, తాగునీరందించే తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్ట్ పరిధిలో గల ఎడమ ప్రధాన కాలువ ఆధునీకరణ పనులు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అసెంబ్లీలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా గత టిడిపిలో 2018-19 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రాప్తికి మంజూరైన రూ.195.34 కోట్ల అంచనా విలువతో మంజూరు చేసినప్పటికీ 23 శాతం పనులు జరిగాయన్నారు. గత వైసిపి ప్రభత్వం పనులు చేయకుండా విస్మరించిందని చెప్పారు. నియోజకవర్గ రైతులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పనులు నూతన ఎస్. ఎస్. ఆర్ రేట్ల ప్రాప్తికి అంచనా విలువ సవరించి మళ్లీ మంజూరు చేయమని కోరారు.

నేరాలు ఘోరాలు

గోడపెళ్లల మధ్య ఇరుక్కుపోయిన శంకరరావు

గోడ కూలి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని పశువుల ఆసుపత్రి సమీపాన ఒక ఇంటి గోడ మీద పడడంతో పని చేస్తున్న కూలి అక్కడక్కడే మృతి చెందారు. మండాది మాధవ అనే టీ దుకాణం యజమానికి చెందిన పాత ఇంటిని ధ్వంసం చేస్తుండగా గోడ కూలిన సంఘటనలో నల్ల శంకరరావు (40) మృతి చెందారు. బంగారమ్మపేటకు చెందిన శంకరరావు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో అక్రమ పశువులను తరలిస్తున్న కంటైనర్‌ను ఎస్సై వై.అమ్మనరావు పట్టుకున్నారు. ఒడిస్సాలో నొవ్వాడ నుంచి అక్రమంగా 18 పశువులు విజయనగరం మానాపురం సంతకు తరలిస్తుండగా ఎస్సై పట్టుకున్నారు. నిర్వహకులు మొహత రామ్, ఆలీ సక్రాజ్‌ఖాన్, రియాజ్‌ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు .

70 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం :

కొందుకుప్ప నుంచి కురుపాంకు అక్రమంగా తీసుకొస్తున్న 70 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.నారాయణరావు తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలతో నాటుసారా తీసుకొస్తున్నట్లు వచ్చిన ముందస్తు సమాచారంతో శనివారం మూలిగూడ కూడలి వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో కురుపాం రెల్లివీధికి చెందిన నలుగుర్ని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వీరి నుంచి 70 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, పట్టుపడిని నలుగురిపై కేసు నమోదు చేసి, రిమాండుకు తరలించారు. ఈ దాడిలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.